13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురం

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసులను ఇరువురి అంగీకారంతో రాజీ చేయడం జరుగుతుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

నీట మునిగిన పొలాలు

భామిని మండలం లివిరి గ్రామంలో ముంపునకు గురైన పొలాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలకు పలుచోట్ల వరి, పత్తిపంట ముంపునకు గురైంది. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అలాగే పలుగ్రామాల్లో రహదారులు దెబ్బతినడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు. ఈ మేరకు వరదప్రభావిత ప్రాంతాల్లోని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం సబ్‌కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి పర్యటించారు. వరద ఉధృతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భామిని మండలంలో గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో చెరువుకు గండిపడి సుమారు 500 ఎకరాల్లోని, సీతానగరం మండలంలో పదెకరాల్లో వరి పంట నీట మునిగినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

- దెబ్బతిన్న రహదారులు
- గెడ్డలు, వాగుల ప్రవాహంతో స్తంభించిన రాకపోకలు
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, సబ్ కలెక్టర్
- రోడ్ల మరమ్మతులకు తక్షణ చర్యలు

ప్రజాశక్తి -భామిని

ఇటీవల కురిసిన వర్షాలకు మూలగూడ మీదుగా వచ్చే కొండలోయగెడ్డ ఉధృతంగా ప్రవహించింది. ఆ వరద నీరు లివిరి గ్రామంలోని కనపల చెరువుకు చేరింది. లివిరి కనపల చెరువు ట్యాంక్ కెపాసిటీ అంత పరిమాణం లేకపోవడంతో ఒకసారి చెరువుకు గండి పడింది. కనపల చెరువులో భారీ గండి ఏర్పడడంతో దిగువ ఉన్న వరి పొలాలు మొత్తం జలమయమయ్యాయి. ఇదే వరద నీరు ప్రవాహంతో లివిరి గ్రామానికి గజపతినగరం జంక్షన్ మధ్య ఉన్న ప్రధాన రహదారికి గండి ఏర్పడి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం స్థానిక తహశీల్దార్ శివన్నారాయణ, రెవెన్యూ పరిశీలకులు మణి ప్రభాకర్, వ్యవసాయ శాఖ అధికారి కొన్ని తిలక్, స్థానిక రెవెన్యూ సిబ్బంది గండిపడిన చెరువును, నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. సుమారుగా 500ఎకరాల మేర వరి పంట మునిగి ఉండొచ్చని వ్యవసాయ అధికారి అంచనా వేశారు. నీటి ప్రవాహం తగ్గాక ఏ మేరకు పంటలు మునిగిందన్న అంశాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు తెలియజేస్తామని వ్యవసాయ అధికారి తెలిపారు. వరి పంట మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని, నష్టాన్ని అంచనా వేసి తమకు న్యాయం చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కొమరాడ : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో వర్షాలు కురవడంతో నదుల్లో నీటి ప్రవాహం పెరిగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నాగావళి, జంఝావతి నదులకు భారీగా వరద నీరు చేరింది. దీంతో ఒడిశా సమీపంలో కొమరాడ ఏజెన్సీ గ్రామమైన కుంతేసుకు వెళ్లే దారిలో కొండవాగుగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి. నాగావళి నది ఆవల ఉన్న పాలెం, మాదలంగి గ్రామ మధ్యలో ఉన్న గుమ్మిడి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదులు, గెడ్డలు, వాగులు వంకలు పరివాహక ప్రాంతాల ప్రజలు నీటి ప్రవాహం వద్దకు వెళ్లకూడదని అధికారులు సూచిస్తున్నారు.

నదీ పరివాహక ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలి

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను నది పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని చాటింపులు చేశారు. నది ప్రవాహం పెద్ద ఉధృతంగా లేదని, ప్రస్తుతం తగ్గిందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

గుమ్మడి గెడ్డ వద్ద రోడ్డుపై అడ్డుగా ఉన్న చెట్టు తొలగింపు

మాదలింగి, పాలెం గ్రామాలకు సమీపంలో గల గుమ్మడి గెడ్డ నుంచి వర్షాలతో నీటి ప్రవాహం పెరగడంతో రోడ్డుపై అడ్డుగా చెట్టు ఉండిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై కె.నీలకంఠం సిబ్బందిని ఘటన స్థలానికి పంపించి జెసిబి సహాయంతో రోడ్డుపై అడ్డుగా ఉన్న చెట్టును తొలగించారు.

సీతానగరం :ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని చిన్నభోగిలి, లక్ష్మీపురం వరి పంట ముంపునకు గురైంది. సుమారు పదెకరాల్లో పంట నష్టం జరిగింది. ఈ పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నీటిలో మునిగిన వరి పంటలను పరిశీలించిన అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్టు తెలిపారు. వరి పంట పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఆయా గ్రామాల వ్యవసాయ శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

ఆగంగూడ రోడ్డుపై పడ్డ కొండచరియను తొలగిస్తున్న ఎస్ఐ, పోలీసులు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

పలు గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కురుపాం : బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత రెండు రోజులుగా పలు గిరి శిఖర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు గానూ రోడ్లు దెబ్బతిన్నాయి. మండలంలోని తిత్తిరి పంచాయతీ ఆవిరి నుంచి గూనగూడకు వెళ్లే రహదారి వరదకు కొట్టుకు పోయింది. అలాగే వలసబల్లేరు పంచాయతీ ఆగంగూడ బిటి రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. అంతేకాకుండా పలు గ్రామాల పరిసరాల్లో ఉన్న వాగులు, గెడ్డలు, చెక్ డాములు పొంగిపొర్లు తుండడంతో గిరిజన ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నీలకంఠాపురం పోలీసులు స్పందించి ఆగంగూడ రోడ్డుకు అడ్డంగా పడిన కొండ చరియలను తొలగించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై పడిన కొండచరియలను తొలగించాలని, అలాగే వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరమైన గుంతలకు తక్షణమే మరమ్మతులు : కలెక్టర్

పార్వతీపురం: ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదకరమైన గుంతలను గుర్తించి నివేదిక అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాటికి నివేదిక అందిస్తే, వాటిపై తక్షణ చర్యలకు ఆదేశాలు జారీచేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో పలు అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర గుంతలను తాత్కాలికంగా పూడ్చేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన అనుమతులను తక్షణమే మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో జెసి ఎస్.ఎస్.శోభిక, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీ ఎస్.దిలీప్ చక్రవర్తి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గుమ్మిడిగెడ్డ వరద ఉధృతిపై తహశీల్దార్‌తో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

కొమరాడలో సబ్ కలెక్టర్ పర్యటన

కొమరాడ : పార్వతీపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్ వైశాలి మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మాదలంగి దగ్గర్లో గల గుమ్మిడి గెడ్డను పరిశీలించారు. గుమ్మిడిగెడ్డ మీదుగా నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలెవరూ నీటి ప్రవాహం గుండా దాటకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గుమ్మిడిగెడ్డకు ఇరువైపులా ఎవరూ దాటకుండా తాడును ఏర్పాటు చేశామని స్థానిక అధికారులు తెలిపారు. వర్షాలు తద్వారా వస్తున్న వరదలకు ఏ ఒక్కరూ గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని, గ్రామ, మండల స్థాయి అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని, పిహెచ్‌సిని, ఎరువుల విక్రయ కేంద్రాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవలు చక్కగా అందించాలని ఆమె ఆదేశించారు. వర్షాకాలంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి పరిస్థితుల్లోనైనా వైద్య సేవలను అందించుటకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఎరువుల పరిస్థితిని సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశిత ధరల కంటే ఎక్కువ మేరకు విక్రయిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు రికార్డులు విధిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడారుగెడ్డ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వర్షప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

మక్కువ : వర్ష ప్రభావిత ప్రాంతాలైన మండలంలోని దుగ్గేరు, గుంటభద్ర, పనసభద్రలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం పర్యటించారు. వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న దుగ్గేరు, అడారుగెడ్డ, పుట్టూరు, సాకిగెడ్డలను, వాగులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో పంట నష్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావం ఎక్కువ సమయంలో ఈ వాగులు, గెడ్డల గుండా ప్రయాణించొద్దని సూచించారు. అలాగే వరద ప్రభావ ప్రాంత నిర్వాసితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దుగ్గేరులోని గల ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ దుకాణంలో స్టాక్ రిజిస్టరును పరిశీలించి యూరియా నిల్వలను సరిచూశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్, అధికారులు ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, సిఆర్‌టిలు

సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్టిలందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం యుటిఎఫ్, గిరిజన సంక్షేమ సిఆర్‌టిల సంఘాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ డీఎస్సీ 2025లో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిల పోస్టులను నోటిఫై చేశారని చెప్పారు. దీనిపై హైకోర్టు వారి పోస్టులను మినహాయించాలని మధ్యంతర ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు. కానీ ఆ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. డీఎస్సీ నుంచి సీఆర్టీలుగా పనిచేస్తున్న పోస్టులను పూర్తిగా మినహాయించాలని వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని మురళీమోహనరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 11 నెలలకు పూర్తి జీతం డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ డీఎస్సీలో 70 : 30 నిష్పత్తిలో డీఎస్సీ నియామకాలు చేపట్టాలని, అందుకు భిన్నంగా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో పదోన్నతులకు ఇవ్వాల్సిన పోస్టులను కూడా డిఎస్సి ద్వారా నియామకాలు చేపట్టడం జరుగుతుందని, దీన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్టి నాయకులు పెంటయ్య, కె.చంద్రశేఖర్, త్రినాధ్, గణపతి, ప్రశాంత్ తదితరులు మాట్లాడారు. అధిక సంఖ్యలో సిఆర్‌టిలు పాల్గొన్నారు.

దేవుడి భూముల్ని కాపాడండి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వివిధ ఆలయాలకు సంబంధించిన విలువైన భూములను కాపాడాలని సామాజిక కార్యకర్త హరి రెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత అట్టహాసంగా జరిగిందని చెప్పారు. సాక్షాత్తు రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారని తెలిపారు. అయితే ఈ ప్రమాణ స్వీకారం చేసిన కమిటీలో పేర్ల విశ్వేశ్వరరావు అనే సభ్యునిపై తాను సిఎం చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టణ బిజెపి అధ్యక్షుడిగా పేర్ల విశ్వేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఎక్కువగా దేవాదాయ భూములనే కొనుగోలు చేశారని చెప్పారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం, సీతారామ స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాలకు చెందిన విలువైన భూములను బిజెపి నాయకుడైన విశ్వేశ్వరరావు కొనుగోలు చేశారని తెలిపారు. దేవాదాయ భూములు కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న బిజెపి నాయకుడ్ని శ్రీ వెంకటేశ్వర ఆలయం కమిటీలో సభ్యుడిగా మంత్రి సంధ్యారాణి ఎలా సిఫార్సు చేశారని ప్రశ్నించారు. దేవుళ్ళ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న బిజెపి నాయకుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త హరి రెడ్డి డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని వెనుకబడిన తరగతుల, సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వసతి గృహ సంక్షేమాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తుందని, అలాగే వసతి గృహ విద్యార్థుల ఉత్తీర్ణత కూడా బాగుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా కొనసాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి వసతి గృహంలో పల్లె నిద్ర, మై స్కూల్ - మై ప్రైడ్ కొనసాగుతుందని తెలిపారు. ఒక్కో హాస్టల్‌ను ఒక మండల ప్రత్యేక అధికారి దత్తతను తీసుకోవడం జరిగిందని, వారి సందర్శన సమయానికి వసతి గృహంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని స్పష్టం చేశారు. అయినప్పటికీ లోటుపాట్లు ఉన్నట్లు ప్రత్యేక అధికారులు నివేదిక అందిస్తే సంబంధిత వార్డెన్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ప్రతి గృహంలో విద్యార్థులకు సంబంధించి హెల్త్ రిజిస్టర్లను నిర్వహించాలని, భవిత కార్డులను కూడా వినియోగించుకోవచ్చని సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యాన్ని పరిశీలించాలని, ప్రతి నెలా అనీమియా పరీక్షలు నిర్వహించి, రక్తహీనత లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ర్యాగింగ్ ఉండరాదని, ప్రహరీ గోడతో పాటు మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, కిటికీలకు మెష్ వీలైనంత వరకు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని, ఆరుబయట విద్యార్థులు తిరగరాదని అన్నారు. ప్రతి తరగతికి ట్యూటర్లు ఉండాలని తెలిపారు. సొంత తల్లిదండ్రులు మాదిరిగా నాణ్యమైన విద్య, ఆహారం, వైద్యం, మౌలిక వసతులను విద్యార్థులకు అందించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విక్రాంపురంలో ఇళ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్‌క లెక్టర్ పవర్ సవ్నల్ జనార్ధన్

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి వీరఘట్టం

వచ్చిన ఫిర్యాదులను త్వరితిగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ సప్నల్ జనార్ధన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కార మార్గం చూపాలన్నారు. రికార్డులు భద్రపరిచే గదిని, రీసర్వే కి సంబంధించి వివరాలను, ఏ విధంగా ఉన్నాయో ఆన్లైన్లో పరిశీలించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి. విక్రంపురంలో అర్జీ దారులతో మాట్లాడారు. వీరఘట్టంలోని గెంబలిలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులతో మాట్లాడి గ్రామానికి సమీపంలో ఉన్న ఆచెప్పవలస గిరిజన గ్రామం వద్ద గత ప్రభుత్వ ఇచ్చిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, వీఆర్వోలు రాజేంద్రప్రసాద్, భీమన్న దొర తదితరులు ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిహెచ్‌డబ్ల్యులు, సిఐటియు నాయకులు

సిహెచ్‌డబ్ల్యులకు జిఒ 94ను అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందించడంలో ఫ్రంట్ లైన్ వర్కర్లుగా కొనసాగుతున్న వారిలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ప్రధానంగా ఉన్నారని, వీరి సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సాలూరులో జరిగిన సిహెచ్ డబ్ల్యూల సంఘం సమావేశంలో యూనియన్ నాయకులు ఎ.రాధ, సిహెచ్ సుహాసిని, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆశా వర్కర్లకు విడుదల చేసిన జీవో 94ను సిహెచ్‌డబ్ల్యులకు అమలు చేయాలని, ప్రసూతి సెలవు, రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.1,50,000 చెల్లింపు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అంతా పిహెచ్‌ల్లో బకాయి ఉన్న సిహెచ్ డబ్ల్యూ ల జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మారుస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనిఫారం, ఇతర అలవెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా తాతచర్యం చేయకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మేరీ, జానకి, సావిత్రి, నాగమణి, సన్యాసమ్మ, భవాని, అశ్విని, లక్ష్మి పెద్ద ఎత్తున కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిహెచ్‌డబ్ల్యు నాయకులు రోజా, సుష్మ, గౌరీశ్వరి, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడారు. కొమరాడ, మాదలింగి రామభదపురం పిహెచ్‌సిల్లో పనిచేయుచున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించని పరిస్థితి ఉందని అన్నారు. ఇచ్చిన రూ .4000 కూడా సక్రమంగా చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వీరికి ఉద్యోగ భద్రత లేదని, రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. పని భారం కూడా విపరీతంగా పెరిగిందని, టిఎ,డిఎ కూడా లేవని,గ్రామంలో ఏం జరిగినా పూర్తి బాధ్యత కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల మీదే అధికారులు నెట్టే పరిస్థితి ఉందని అన్నారు. సిహెచ్‌డబ్ల్యులకు కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో పాలకొండలో జరుగు సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

517 వికలాంగ పింఛనుదార్లకు నోటీసులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని 35 పంచాయతీల్లో 21 సచివాలయాల ద్వారా పొందుతున్న 517 మంది వికలాంగు పింఛనుదారులకు నోటీసులు వచ్చినట్లు ఎంపిడిఒ ఎంఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే 75 మంది దరఖాస్తులను అప్లోడ్ అయినట్లు తెలిపారు. మిగతా 48 మందికి నోటీసులకు సరైన సమాధానం లేకపోతే అప్లోడ్ కాదన్నారు. వీరంతా పాత, కొత్త సదరం సర్టిఫికెట్లు, వ్యక్తిగత దరఖాస్తులు, ఆధార్ కార్డు ఇచ్చిన నోటీసును ఫోన్ నెంబర్‌తో జత చేసి కార్యాలయం అందజేస్తే వారి వివరాలను అప్లోడ్ చేస్తామన్నారు.

నిరసన తెలుపుతున్న పిసిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, గిరిజనులు

ఏనుగుల గూడకు పక్కా ఇళ్లు, సిసి రోడ్డు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలో గల ఏనుగులగూడకు పిఎం జన్‌దన్ యోజన కింద పక్కా ఇళ్లు, సిసి రోడ్డు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఏనుగులుగూడలో ప్రజలతో కలిసి మంగళవారంనిరసన చేపట్టారు. అనంతరం ఆయను మాట్లాడుతూ గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలైన ఇళ్లు, రోడ్డు, విద్య, వైద్య, తాగునీటి సదుపాయాలు కల్పించాలని, పిఎం జన్‌దన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు మన్యం జిల్లాలో గిరిజనులకు ఇవ్వడం లేదని, గిరిజనులందరికీ పక్కా ఇళ్లు రాజకీయాలతో ప్రమేయం లేకుండా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు మౌలిక వసతులు కల్పించే వరకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం, గిరిజన సంఘం నాయకులు మండంగి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గరుగుబిల్లి రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు బుధవారం నుంచి డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నదని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల చలపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో బిఎ, బికాం, బిఎస్సి కోర్సుల్లో చేరే విద్యార్థులు సంప్రదించాలన్నారు. తమ కళాశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండి మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. ఎన్‌సిసి కూడా ఉందని, రెండు పూటలా కళాశాల నడుస్తున్నట్టు తెలిపారు. పూర్తిస్థాయి లేబొరేటరీ, లైబ్రరీ, బోధనాసిబ్బంది, భవనాలు, మౌలికసదుపాయాలు, పచ్చని మైదానం, క్రీడాసముదాయం కలిగిన కళాశాలని, విద్యార్థులకు విద్యాబోధనతో పాటు ఉద్యోగపరమైన అంశాల్లోనూ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ కోర్సులపై అవగాహన, శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం పార్వతీపురం మండలం డోకిశీల పిహెచ్‌సిని కలెక్టర్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని, అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరాతీశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలు దృష్ట్యా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

ఏరియా ఆసుపత్రి సందర్శించిన డిసిహెచ్‌ఎస్

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త ఎన్.నాగభూషణరావు మంగళవారం సందర్శించారు. ఈనెల 18న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన స్థానికంగా ఉండరు.... హౌస్ ఎలివేన్స్ వదలరు అన్న వార్తకు డిసిహెచ్‌ఎస్ స్పందించారు. రోగులకు సక్రమంగా వైద్యసేవలందించకపోతే ఎలా అంటూ వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ఒపి తర్వాత కూడా ఖచ్చితంగా ఆసుపత్రిలో ఉండాలన్నారు. రోగి ఒక రోజు చూసిన వైద్యుడు మరుసటి రోజే లేకపోతే రోగికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఆసుపత్రి పని తీరు మారాన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఈనెల 27నుంచి జరగనున్న వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి అని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి వివరాలు మండపాల ప్రదేశం, ఉత్సవాలు జరిపే తేదీలు, నిమజ్జనం జరిపే తేదీలు పూర్తి వివరాలు కూడిన సమాచారాన్ని పోలీసు వారికి ముందస్తుగా తెలియపర్చాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల సూచన మేరకు 9రోజుల్లోపు నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం కార్యక్రమాలు రాత్రి 11 గంటల్లోపు ముగించాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల్లో ప్రజల సమస్యలపై సర్వేలు నిర్వహించి పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, రహదారి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పిఎం జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ల పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బివై నాగభూషణరావు, సచివాలయ, హౌసింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలోనే ఐటిడిఎ డిడి కార్యాలయం కొనసాగించాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలోనే ఐటిడిఎ డిడి కార్యాలయం కొనసాగించాలని ఆదివాసీ నాయకులు బిడ్డిక దమయంతినాయుడు అన్నారు. స్థానిక సామాజిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన కమిటీ సీతంపేటకు రానున్న సందర్భంలో అత్యవసర సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. సీతంపేట ప్రజల భవిష్యత్తు సీతంపేటలోనే ఐటిడిఎ, ట్రైబల్ వెల్ఫేర్ డిడి కార్యాలయం యధావిధిగా కొనసాగించాలన్నారు. దీనిపై మరోసారి అత్యవసర సమావేశానికి అన్ని సంఘాలతో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఆదివాసీ జెఎసి నాయకులు, రాజకీయ ప్రతినిధులు ట్రైబల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు సవర మాలయ్య, సవర తోటముఖలింగం, సవర జాన్, మండంగి విశ్వనాథం, మీడియా ప్రతినిధి బిడ్డిక రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఎన్నికైన ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘ సభ్యులు

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీపురం మన్యం జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. స్థానిక ఎపి ఎన్‌జిఒ భవనంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొని, అందరి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ నాయకులు, సీనియర్ ఫొటో గ్రాఫర్లు మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్ల అభివృద్ధికి అంతాకలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా బి.అజిత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా ఇ.దుర్గాప్రసాద్, సెక్రటరీగా సిహెచ్ ముఖేష్, జాయింట్ సెక్రటరీ జి.శ్రావణ్ కుమార్, కోశాధికారిగా టి.సందీప్ చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



అమ్మో దోమా! జాగ్రత్త సుమా..!

పెరుగుతున్న మలేరియా కేసులు

నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

చిన్న దోమ ఎంత ఎంత ప్రాణాంతకమో చెప్పడానికి మలేరియా, డెంగీ చికెనుగున్య వంటి జ్వరాలే నిదర్శనం. ప్రపంచానికి సాధారణ శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్ రోనాల్డ్ రోస్ శతాబ్దం క్రితం రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజానిక్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ప్రకటించింది.

పట్టణాలతో పాటు గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో దోమలు బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల కాలంలో రోజురోజుకు మలేరియా, డెంగీ కేసుల సంఖ్య పెరుగుతుంది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలో ఎక్కువమంది రోగులు చేరుతున్నారు. అయితే వీటి నివారణకు పలు చర్యలు చేపడుతున్నా పరిస్థితి మాత్రం యథతథం. దోమ ఎగురుతున్నప్పుడు పట్టుకొని చంపడం చాలా కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవడానికి ఎంతో శ్రమించాలి. దోమలు నీటిలో లార్వా దశలో పెరుగుతున్నప్పుడు నాశనం చేయడం చాలా సులువైన పద్ధతి. ఇవి ఇంట్లోని నీటి నిల్వ చేసే కుండీలో చిన్న చిన్న పురుగుల కనిపిస్తుంటాయి. వాటిని చాలామంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు. లార్వా నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపా దశలో ఉన్న వాటిని వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ 100 నుంచి 200 గుడ్లను పెడుతుంది. ఇవన్నీ కేవలం ఎనిమిది నుంచి పది రోజుల్లో దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా, ప్యూపా అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతాయి.

నేడు అవగాహన ర్యాలీ

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ నుంచి ఏరియా ఆసుపత్రి వరకు వైద్య సిబ్బందిలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో డిఎంఒ పివి సత్యనారాయణ, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, ఎంపిడిఒ సత్యం, వైద్యాధికారులు పాల్గొంటారని తెలిపారు.

దోమలపై దాడి

దోమలు ప్రజల రక్తాన్ని జలగాల్లా పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతినెలా లిక్విడ్ మస్కిటో రిపెల్ట్, కాయిల్స్, మస్కిటో డూప్ స్టిక్స్ వంటివి ఉపయోగిస్తున్నారు. ఇవే కాకుండా దోమలు బ్యాట్లు, దోమతెరలు, యాంటీ మస్కిటో మెస్సులు వంటివి వాటిని వినియోగిస్తున్నారు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులు నివారణకు ప్రత్యేకంగా రోగులకు చేతి చమురు వదిలేస్తుంది.

దోమల నివారణ

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విష జ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే. మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రిపేల్, పాయింట్స్ కాయిల్ వంటి దోమలు నివారణకు ఇంట్లో వాడతాం. వాటివల్ల కొన్ని వ్యాధులు వస్తాయి. అయితే ఈ నేపథ్యంలో దోమల నివారణకు చర్యలు చేపట్టడం ఉత్తం. వేప నూనెతో దోమలను తరిమికొట్టడానికి బాగా పని చేస్తుంది. దీని వాసన దోమలు భరించవు. వేప, కొబ్బరి నూనెను సమాన భాగాలుగా చేసుకొని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరి చేరవు. కర్పూరం కూడా మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాల్లో కర్పూనాన్ని వెలిగిస్తే దాని నుంచి వచ్చే పొగతో దోమలు మాయమవుతాయి.

ఆడ దోమలే ప్రమాదం

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. కానీ ఆడ దోమలు మాత్రం సంతాన అభివృద్ధిలో భాగంగా. గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈ క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టి దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంధుల్లోకి చేరుతుంది. అక్కడ పారాసైట్లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు దాని లాలాజలంతో పాటు పారాసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది.ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి జ్వరాలు, ఇడిస్, క్యూలెక్స్ దోమల వల్ల బోదకాలు వస్తాయి.

గ్రామాల్లో అవగాహన

గిరిజన గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యం కల్పిస్తున్నాం. గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ చేసి, దోమతెరలపై అవగాహన కల్పిస్తున్నారు.

జె మోహన్ రావు,
మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్,

సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న ఆటో కార్మికులు

ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు సాయం అందించాలి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకంతో నష్టపోయిన ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు సహాయం అందించాలని ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు ఈ మేరకు ఆంజనేయ గుడి ఆవరణంలో మంగళవారం ఆటో కార్మిక సంఘాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దావాల రమణారావు మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యంతో స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెల్ఫేర్ బోర్డు కూడా తక్షణమే అమలు చేయాలన్నారు. సొంత పెట్టుబడితో ఒకపక్క ఫైనాన్స్ కిస్తీలు, మరోవైపు ఆర్టీవో ఆఫీసులో పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. వాహన మిత్ర కింద రూ.10వేలు నుంచి రూ.15వేలకు పెంచి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని అన్నారు. ఆటోడ్రైవర్లకు జరిగే నష్టానికి ప్రభుత్వం బాధ్యత తీసుకొని ఆర్థికంగా ఆదుకోవాలని, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేలు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్‌కు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న పాలకొండ ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మానించింది. కాదా రాము అధ్యక్షతన జరిగిన ఆటో కార్మిక సంఘాల సమావేశంలో పి.శేఖర్, పి.మహేష్, డి.దుర్గారావు, కె.శ్రీను, మహేష్, బి.ప్రసాదు, ఎన్ రాంబాబు, పి.సాయికుమార్, పి.గౌరేశ్వరరావు, పి.రామారావు, శంకర్రావు, శ్రీను, రామారావు, సాయి, కోటి ,సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

కంబరవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు సచివాలయం పరిధి కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణతో మెరుగైన వైద్య సేవలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యేలా శిక్షణను సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. వైద్యాధికారులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్,టిబి ముక్త్ భారత్ లపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం శిక్షణా నిర్వహించారు. పవర్ ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, అధికారులు శిక్షణా అంశాలను వివరించారు. అనంతరం డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ప్రతి ఒక్కరికీ అభా గుర్తింపు ఉండాలని, తద్వారా ఆరోగ్య తనిఖీల కోసం ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ వారి ఆధార్, మొబైల్ నెంబర్‌తో అభా గుర్తింపు నెంబర్ జెనరేట్ చేయాలన్నారు. టిబి ముక్త్ భారత్‌లో భాగంగా క్షయ మరణాలు లేకుండా చూడాలని, ఇందుకోసం లక్షణాలున్న వారిని సత్వరమే గుర్తించి నిర్ధారించడం, వల్నరబుల్ వ్యక్తులందరికీ స్క్రీనింగ్ జరపడం, టిబి నిర్ధారణ పిదప నిర్దేశించిన కాలం వరకు షెడ్యూల్ ప్రకారం మందులు వేసుకోవడం పర్యవేక్షణ అత్యంత ముఖ్యమని తెలిపారు. వైద్యాధికారులు,వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు శిక్షణా అంశాలను పునఃశ్చరణ చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎబిడిఎం ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జె.కోటిరెడ్డి, డిఐఒ డాక్టర్ విజయమోహన్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, డెమోలు, ఐటి సిబ్బంది జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధి పనులు ముగించి నాలుగు నెలలైనా ఇప్పటికీ మూడు వారాల బిల్లులు నేటికీ మంజూరు చేయలేదని, తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు పి.వెంకటస్వామి, వై.మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపిడిఒకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ బిల్లులు 14 రోజుల్లో చెల్లించాలని, లేనిపక్షంలో వడ్డీతో సహా చెల్లించాలని ఉపాధి హామీ చట్టం చెబుతున్నా అధికారులు అలా చేయడంలేదన్నారు. పని చేసిన 14 రోజులకు బిల్లులు చెల్లించకుండా నాలుగు నెలలవుతుందని, కష్టపడిన ఉపాధి కూలీలకు కడుపు కొట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తీవ్రమైన ఎండలో రెండు పూటలా పనిచేస్తే బిల్లులు చెల్లించక పోవడం దారుణమన్నారు. ఎప్పటికైనా బిల్లులు చెల్లించాలని కోరారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ బిల్లుల చెల్లింపునకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మజ్జి దుర్గారావు, పాపమ్మ, రాజేశ్వరమ్మ, అన్నపూర్ణ, సూర్యుడమ్మ, పాల్గొన్నారు.



బలిజిపేట ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న ఉపాధిహామీ వేతనదారులు

కొమరాడ : మండలంలోని ఏడు వారాల పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు తక్షణమే అందజేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బంగారంపేటలో ఉపాధిహామీ కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రెండు పూటలా మండుటెండల్లో ఏడు వారాలుగా ఉపాధి పనులు చేసినప్పటికీ కూలీలకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో వేతనదారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

రైతు సంక్షేమానికి, అభివృద్ధికి ఎఎంసి పాలకవర్గం కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎఎంసి చైర్‌పర్సన్ గా గొట్టాపు గౌరి, వైస్ చైర్మన్‌గా రౌతు వేణుగోపాల నాయుడు, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారందరికీ అధిష్టానం గుర్తించిందని, ఆ కారణంతోనే ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పదవిని ఇస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే పార్వతీపురం ఎఎంసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని, సుదీర్ఘంగా టిడిపి కోసం పని చేసిన వారందరికీ పదవులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతన కార్యవర్గం రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి కషి చేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా గొట్టాపు గౌరి, వైస్ చైర్మన్ గా రౌతు వేణుగోపాల్ నాయుడు, అలాగే సభ్యులందరికీ రైతుల కష్టాలను తెలుసుకొని వారి బాధలను తీర్చే బాధ్యత మీపై ఉందని అన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థినిలు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కె నీలకంఠం అన్నారు. మంగళవారం స్థానిక కెజిబివిలో శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, చట్టాలపై అవగాహన, పలు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలను మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలు విద్యార్థి దశలో కీలకంగా ఉంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. సైబర్ నేరాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏవైనా విద్యార్థినీలకు ఇబ్బందులు ఉన్నట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలపై దాడులు జరిగే సమయంలో ఎదురు దాడి చేసేలామహిళలకు పలు టెక్నికల్ను శక్తి టీం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు స్థానిక పోలీసులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీతంపేట : స్థానిక గురుకుల బాలుర కళాశాలలో సైబర్ నేరాలపై ఎస్సై వై.అమ్మనరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల గురించి తెలిపారు. గంజాయి, గుట్కా, ఖైనీ వంటి డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సీతంపేట సంత మార్కెట్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ఉండాలన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ సంజీవ్, ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కొమరాడ ఎస్ఐ నీలకంఠం

నూతన పద్ధతులను అలవర్చుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాగు ప్రతి రైతు ఎప్పటికప్పుడు నూతన పద్ధతుల వైపు మళ్లేలా కృషి చేసుకొని తమ ఆదాయాన్ని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందేలా ముందుకు రావాలని సాలూరు ఎడిఎ జి.సత్యవతి తెలిపారు. మండలంలోని బోరబంద, గుమడాంలో మండల వ్యవసాయశాఖాధికారి శిరీష, విఎఎల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని పురాతనమైన నాటు పద్ధతుల్లో కాకుండా ఆధునిక కాలంలో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ మోతాదులో దిగుబడులు, అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నించినప్పుడే ఆ రైతు అత్యధిక లాభం పొంది సంతోషంగా ఉండడానికి దోహదపడుతుందని ఆమె తెలిపారు. ఎఒ శిరీష మాట్లాడుతూ ఎరువులు తగిన మోతాదులో వేసుకున్నట్లయితే పంట వేపుగా పెరిగి మంచి ఆదాయం వస్తుందన్నారు. మొక్కజొన్న, వరిలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కెవికె శాస్త్రవేత్త అమృత వీణ వరి, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు తెలిపారు. పశు వైద్యాధికారి డాక్టర్ అను పశు పోషణ చేపట్టే రైతులు జీవాలకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విఎఎలు పాల్గొన్నారు.

వర్షాల తర్వాత పంటలకు నానో యూరియా

పాచిపెంట : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్కజొన్న వంటి పంటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, వర్షాలు వెలిసిన తర్వాత పంటలపై మల్టీకే ఒక కేజీ, నానో యూరియా అర లీటరు కలిపి తప్పనిసరిగా పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని కుడుమూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ వర్షాలు వెలిసిన తర్వాత పంటలకు తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని, అలాగే పోషక లోపాలు ఏర్పడతాయని, వీటిని నివారించుకోవాలని తెలిపారు. పత్తి పంటలో కాయకుళ్ళు, ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని నివారణకు ప్రోపికోనజోల్ ఒక లీటరు నీటికి ఒక మిల్లీమీటరు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే థయోమెథ క్సమ్ 0.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని వీటిలో నానో యూరియా, మల్టీకే కలిపి పిచికారీ చేయడం ద్వారా పోషకాలోపాలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ రాని రైతులు బుధవారంలోగా గ్రీవెన్స్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఏకపంట విధానాన్ని వదిలి పలు పంటలు విధానాన్ని అవలంభించాలని, గట్లపై అదనపు ఆదాయాన్నిచ్చే చెట్లను లేదా కంది వంటి పంటలను వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ యశోదకృష్ణ, ప్రకృతి సేద్య సిఆర్‌పిలు సురేష్ , రాజు, అప్పన్న రైతులు పాల్గొన్నారు.

కె వెంకటాపురంలో పొలంబడి

సీతానగరం : మండలంలోని కె.వెంకటాపురం, లక్ష్మీపురంలో పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు రంగు, జిగురు అట్టలు వరి పంటలో తెల్ల రసం పీల్చే వంటి కీటకాలను సహజ పద్ధతిలో నియంత్రించడంలో అత్యంత ప్రభావకరంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ అట్టల వల్ల రసాయనిక పురుగుమందుల వినియోగం తగ్గుతుందని, పర్యావరణానికి హాని లేకుండా కీట నియంత్రణ సాధ్యమతుందని, ఖర్చు తక్కువ, వినియోగం సులభమని, మిత్ర కీటకాలకు హాని చేయదని తెలిపారు. అలాగే వరి పంట నాణ్యత మెరుగుపడుతుందన్నారు. కావున ఎకరాకు 10 నుంచి 15 అట్టలు ఏర్పాటు చేయాలని, వీటిని భూమి నుండి 6-8 అడుగుల ఎత్తులో ఉంచాలని సూచించారు. వారానికి ఒకసారి అట్టలను తనిఖీ చేసి, అవసరమైతే మార్చాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దోమతెరలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దోమతెరలు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎ.గంగారావు, మోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం జి.శివడ సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షా కాలం కారణంగా గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారని, కావున తక్షణమే వైద్య సిబ్బంది స్పందించి ప్రతి గిరిజన గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, దోమతెరలు పంపిణీ చేసి ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సి కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎ. మోనోషి, బి.నాగేష్, ఎన్.పూజిత తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కొమరాడ

నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొమరాడ ఎస్సై కె నీలకంఠం తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ గుమడ పరిసర ప్రాంతాల్లో నాటుసారాతో ఉన్నట్టు తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో పాటు వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఇద్దరు వ్యక్తుల నుంచి 20 లీటర్ల నాటు సారాను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం వారి వద్ద ఉన్న 20 లీటర్ల నాటు సారాను ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకి తరలించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.